# మనసు కథ

పక్కింటి పిల్లలు వరండాలో కేరమ్స్ ఆడుతూ గలభా చేస్తున్నారు.

నేను వాలుకుర్చీలో కూర్చుని ఆకాశంకేసి చూస్తున్నాను. మబ్బులు ముసురుకుంటున్నై. చల్లటి గాలి వీస్తోంది. 'ఆషాఢస్య ప్రథమ దివసే...' అనుకున్నాను.

పెరట్లో ఆరేసిన బట్టల్ని లోపలికి తీసుకుపోతోంది శకుంతల.

ఎందుకో ఉదయంనుంచీ ముభావంగానే వుంది శకుంతల. ఆమె ప్రవర్తన గురించి నాలో నేను తర్కించుకుంటూ కూర్చున్నాను.

ఇరవైనాలుగేళ్ళ దాంపత్యజీవితపు సాహచర్యంలో శకుంతలని బాగానే చదివాననే అహమూ, నమ్మకమూ నాకుంది. ఆమె తత్వం, మనస్తత్వం నాకు బాగానే అవగతమయ్యాయనే ధృఢమైన అభిప్రాయం ఏర్పరచుకున్నాన్నేను. దీనికి దాఖలాగా — ఈ ఇరవైనాలుగేళ్ళల్లోనూ జరిగిన సంఘటనలూ, సంభవాలూ నాలుగైదింటిని మీకు చెప్పగలను.

మా పెళ్ళయిన కొత్తల్లో—

శకుంతలని తీసుకుని మా పెద్దమ్మగారి పల్లెకు వెళ్ళేను.

మా అమ్మకు ఒకతే అక్క. మా నాన్న పోయాక మా బాధ్యతంతా ఆమే వహించటం వలన నా బాల్యమంతా ఆ పల్లెలోనే గడిచింది. ఎటొచ్చీ నా పై చదువులకోసం నేనూ, అమ్మ పట్నం రావడం వలనా, ఆ వెంటనే నాకు ఉద్యోగం దొరకడం వలనా—నేను అప్పటికి పదేళ్ళుగా పల్లెకు దూరమయ్యాను.

మా పెద్దమ్మ పేరు శాంతమ్మ. ఆమెకు ఆరోగ్యం బాగుండక నా పెళ్ళికి రాలేదు. అందువలన, "కోడలిని ఆమెకి చూపి ఆమె దీవెన పొందాలనే" మా అమ్మ పట్టుదల వలనా—నేను అమ్మతోనూ, శకుంతలతోనూ కలిసి పల్లెకు ప్రయాణ మయ్యాను.

పల్లెలో నాలుగురోజులు-మా-మకాం. అలా అనుకునే వెళ్ళాము.

మూడోరోజు రాత్రి—

వాముల దొడ్లోనుంచీ జనుము తెస్తుంటే, మా పెద్దమ్మ మనవణ్ణి పాము కరిచింది. మా అన్నా—వదినలకు వాడొక్కడే బిడ్డడు. పదేళ్ళవాడు.

అంతా గోల...ఏడుపులు...పెడబొబ్బలు.

గబ్బాకు పుచ్చాకు వైద్యాలు జరిగిన్నై. పరిస్థితి విషమించడంతో తెల్లవారుఝూమున పట్నం హాస్పటల్‌కు తీసుకు వెళ్ళాము. ఉదయం పదింటికి వాడు పోయాడు.

కంటికీ, మంటికీ ఏకధారగా రోదనలు.

ఊరంతా దుఃఖించింది.

ఆ సంఘటన నన్నూ ఎంతగానో కలచివేసింది. కానీ, శకుంతలలో ఎలాంటి చలనమూ లేదు. నిబ్బరంగా రాతిబొమ్మలా వుండిపోయింది.

మర్నాడు—

" మనం వెళ్ళిపోదాం " అంది చాలా మామూలుగా.

నేను సందిగ్ధంలో పడ్డాను.

" బాగుండదు. నాలుగురోజులు ఆగి తర్వాత వెళ్దాం " అన్నాను.

శకుంతల వినలేదు. 'వెళ్తామని' చెప్తే అమ్మా పెద్దమ్మా నాకేసి అదోలా చూసేరు. పెద్దమ్మ కళ్ళల్లోని బాధ నాకు అర్థం కాకపోలేదు. అయినా, ఆ సాయంత్రం అందరి హృదయాల మీదుగా నడుచుకుంటూ వచ్చేశాము.

రైల్లో కూర్చున్నాక అన్నది శకుంతల—" ఎవరి ఏడుపు వాళ్ళది. మనమెక్కడ ఛస్తాం " నేను గతుక్కుమన్నాను. గుండె అంచున మేకుతో గీరినట్లయింది. మళ్ళీ నేను మామూలు మనిషిని అవడానికి చాలా సమయం పట్టింది.

శకుంతల అడపా దడపా పుట్టింటికి వెళ్ళేది. ఫలానా రోజున తిరిగి వస్తాననేది. లేదా ఫలానా రోజుకి తప్పకుండా రమ్మని నేను చెప్పి పంపేవాణ్ణి. 'నువ్ లేకుండా నేనుండలేనని' తన చేతిని నా చేతిలోకి తీసుకొని జాలిగా తన కళ్ళల్లోకి చూస్తూ చెప్పేవాణ్ణి. "అలాగేలెండీ" అని ఓ దీర్ఘం తీసి వెళ్ళిపోయేది. కాలం అతి భారంగా గడిచి ఎట్టకేలకు అనుకున్న రోజు వచ్చేది. శకుంతల మాత్రం వచ్చేది కాదు. అక్కణ్ణుంచీ క్షణమొక యుగంగా వుండేది నాకు. ఏదో పిచ్చి. పిచ్చిలో పిచ్చి కోపం. నేను చెప్పినమాట వినలేదనే అహం తెచ్చిన రోషం, నా అవస్థని గమనించలేదే అనే ఉక్రోషం ! కుమిలిపోయేది మనస్సు.

కొన్నిసార్లు అత్తగారింటికి పరిగెత్తేవాణ్ణి. నాళ్ళు గడుస్తూ వుండేవి. గడువుతీరిన ఏ వారం పది రోజులకో తీరిగ్గా దిగేది.

వాళ్ళ బామ్మకి బాగాలేదనో, వాళ్ళ నాన్నకి మంచిరోజు దొరకలేదనో, తనకు ఇబ్బందనో ఏదో చెప్పేది.

నేను మూతి బిగించుకుని, పళ్ళు కొరుక్కుని చిందులు తొక్కేవాణ్ణి.

"ఇంతలో ఏం మునిగిపోయిందనీ-అంత చిరాకూ, కోపం. మీరెప్పుడూ యింతే. వొక అచ్చటా ముచ్చటా లేదు. వచ్చేగా...ఇప్పుడెందుకింకా ఈ అలక" అనేది.

నేను క్షతగాత్రుడిలా 'కుయ్ కుయ్' లాడుకుంటూ వుండేవాణ్ణి.

ఆ రోజు నాకు యిప్పటికీ గుర్తు.

వేసవి కాలం.

ఇంట్లో అమ్మ లేదు. ఒక రాత్రివేళ మెలకువ వచ్చింది. కడుపులో పేగులు ఉంగలు చుట్టుకుపోతున్నట్టు ఒకటే బాధ. ఏదో వికారంగా వుంది. వాంతి అవుతుందేమోనన్న భావన... కానీ...కావడంలేదు. ఒక గంట మూగ బాధని అనుభవించి, ఇక తట్టుకోలేక లేచి కూర్చున్నాను.

శకుంతల గురక పెట్తోంది. అయినా సరేనని లేపేను. ఉన్న బాధలన్నీ ఏకరవు పెట్టాను. ఆమె కవళికలో విసుగు తెలుస్తూనే వుంది నాకు. అయినా, తాపీగా విన్నది.

మంచం దిగి లోపలికి వెళ్తూ అన్నది, " ఏం ఫర్వాలేదు. వేసవికాలం గదా. రాత్రి మీరు సరిగా భోజనంచేసి వుండరు. సరిపడా తినకపోతే ఎవరికైనా అలాగే వుంటుంది ".

నాకు మనస్సు చివుక్కుమంది.

క్షణాల తర్వాత, మజ్జిగ రసం పిండి గిన్నెలో పోసుకుని తెచ్చింది. తాగమంది. తాగేను. ఆ తర్వాత తాను వేరే చాప వేసుకుని కమ్మగా మళ్ళీ గురకదీయడం మొదలెట్టింది.

నా అవస్థంతా అతి తేలిగ్గా తీసి పక్కన పెట్టి "ఫర్వాలేదు పడుకో " అన్నట్లనిపించింది. ఈ భావనతో ఆ తర్వాత అసలే నిద్రపట్టలేదు.

మా పెద్దమ్మాయి రోహిణి ఐదోఏట—అనుకుంటాను—ఒకసారి...

రోహిణిని మా పెద్దమ్మ పల్లెకి తీసుకువెళ్తానంది. నేను వీల్లేదన్నాను. పిల్లలేకుండా నేను వుండలేనని బేలపడి పోయాను. నిజానికి కళ్ళల్లో నీళ్ళు తిరిగినై.

శకుంతల చాలా సాదాగా, " తీసుకువెళ్ళండి అత్తయ్య గారూ. దానికీ కొంచెం అలవాటవుతుంది " అని పట్టుబట్టి పంపించింది.

మా అమ్మ ఆ రాత్రి తన ధోరణిలో తాను మరోసారి అన్నది, " నీ పెళ్ళాం మహా కఠిన గుత్తిరా " అని.

నేను నిర్లిప్తంగా చూస్తుండిపోయాను.

చంద్రం పుట్టేడు. వాడికి ఆరో ఏట—ఓ రోజు—వొళ్లు వెచ్చబడింది. మర్నాటికి నూట రెండు జ్వరం. నాలుగు లంఖణాలు చేయించినా వందకు తగ్గలేదు. ఐదో రోజుకి తొంభై తొమ్మిది మీద నాలుగు పాయింట్లు. ఆ టెంపరేచర్ ఇక కిందికి దిగలేదు.

వారం గడిచింది. పదిహేను రోజులు జరిగినై. డాక్టర్లు మారేరు. అన్ని టెస్టులూ అయినై. ఏ లోపమూ లేదు. జబ్బేమిటో ఎవరికీ అంతు పట్టలేదు. ఆకలికి పిల్లవాడు ఆగలేక ఏడవడం మొదలెట్టాడు.

ఆ సాయంత్రం శకుంతల అన్నది, " వాళ్ళ వైద్యం వాళ్ళు చాలుగానీ—రేపు పథ్యం పెడతాను ".

మా అమ్మ ఎడాపెడా వాయించేసింది, "జ్వరంలో అన్నం పెడితే విషమౌతుంద"ని. నేను ముభావంగా వూరుకుండిపోయాను.

శకుంతల పథ్యం పెట్టింది. అమ్మ మాటలకూ, నా చూపులకూ సమాధానమన్నట్లు, ఏం ఫర్వాలేదు, విడిగా ఏ బాధా లేనివాడికి జ్వరమేమిటి ? అని ఎదురు ప్రశ్న వేసింది.

ఆర్నాటినుంచీ హాయిగా ఆడుకోవడం మొదలెట్టాడు చంద్రం. వారం రోజుల్లో మునుపటికన్నా ఉత్సాహంగా తిరగడం, చదవడం చేస్తూ వచ్చేడు. కానీ, టెంపరేచర్ మాత్రం తగ్గలేదు.

నెల గడిచింది. నా మటుకు నేను లోపల భయపడ్తూనే వున్నాను. నలుగురు డాక్టర్లను మార్చాను. పిల్లవాడి పరిస్థితిలో మార్పులేదు. నాకూ అమ్మకూ గుండెల్లో దడగానే వుండేది.

శకుంతల మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వుండిపోయింది. టైము ప్రకారం లెక్కగా వాడికి ఏదో ఒకటి పెడ్తూ వుండటం చేసింది.

డాక్టర్లకు కూడా అంతుపట్టని ఆ టెంపరేచర్ రెండో నెల తిరిగేసరికి మాసిపోయింది.

"మీ యావిడ నిజంగా రాతి మనిషేరా నాయనా" అంది మళ్ళీ అమ్మ.

నేనిలా చెప్తుంటే—శకుంతల బొమ్మకి రంగులు పులుముతున్నాననుకోవచ్చుగానీ, ఇంకొక ముఖ్యమైన సంభవాన్ని చెప్తాను.

మా మూడో సంతానం శంకరం. వాడికి అప్పుడు మూడేళ్ళు నిండాయనుకుంటాను.

ఒకరోజు పుదయం——

నేను ముందు వరండాలో కూర్చుని ఏదో చదువుకుంటు న్నాను. లో వాకిట్లో సైకిల్‌తో కుస్తీ పడుతున్నాడు శంకరం.

సైకిల్‌కి వొకవైపు నిలబడి వెనక చక్రాన్ని తిప్పడం, మధ్య మధ్య ఆ చక్రం చువ్వల్ని పట్టుకోబోవడం, వేళ్ళకి దెబ్బ తగిలి తక్కున చేతిని వెనక్కి తీసుకుని బిక్కమొహం వేయడం-మళ్ళీ అంతలోనే చక్రాన్ని తిప్పడం-ఇలా సాగుతోంది వాడి ఆట.

శంకరంకి పది గజాల దూరంలో వడియాలు పెడుతోంది శకుంతల.

శంకరం ఆటని గమనిస్తున్న నాకు-ఏ క్షణాన్నయినా ఆ సైకిల్ వాడిమీద పడుతుందనే ఆందోళన కలిగింది.

శకుంతలని పిలచి వాణ్ణి ఇవతలకి తియ్యమని చెప్పాను.

"ఫర్వాలేదులెండి. పిల్లవాడు ముచ్చటపడి ఆడు కుంటుంటే-మీ కన్నీ భయాలే. ఏం కాదులెండి" అని నా హెచ్చరికని ప్రక్కకు నెట్టింది.

క్షణాల తర్వాత నేను లేచాను. వాణ్ణి పక్కకి లాగి, భయపెట్టి మరోసారి శకుంతలని హెచ్చరించి-దొడ్లోకి స్నానానికి

వెళ్ళాను. నేను స్నానం పూర్తిచేసి తిరిగి వస్తూండగా—అదే క్షణంలో సైకిల్ పడటం, దాని అడుగునపడి శంకరం కాలు నలగడం—నేను అనుకున్నంతా జరిగింది.

కాలు వాచింది. చేతులమీద పొట్టమీద గీరుకుపోయింది. పిల్లవాడు నెప్పివల్ల గోలపెట్టి ఏడుస్తున్నాడు. చేతుల్లో నిలవడం లేదు.

నాకు కోపం మండిపోయింది. బాధా కలిగింది. శకుంతల మీద కసురుకుని ఏవేవో అన్నాను. అనేవన్నీ అననిచ్చి ఆమె వొక్కటే మాట అన్నది; "పిల్లలన్న తర్వాత ఇలాంటివి చాలా సహజం. రెండ్రోజులు పోతే అదే తగ్గుతుంది".

ఆ క్షణంలో నాకు—మా అమ్మ శకుంతలను గురించి అనే మాటలన్నీ ఖచ్చితంగా నిజమనిపించాయి.

ఏళ్ళు గడిచిపోయాయి.

రోహిణి పెళ్ళి జరిగింది. అప్పగింతలైనై. అమ్మాయిని అత్తగారూ వాళ్ళు తీసుకు వెళ్తున్నారు.

ఎందుకో చెప్పలేను. తీరా రిక్షాలు కదులుతుంటే నాకు కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. మా అమ్మ సరేసరి. గుండెల్లోనుంచీ పొంగుతున్న బాధతో శకుంతలకేసి చూశాను. ఆమె నిర్లిప్తంగా రోహిణికి ఏదో చెప్తూ, వీడ్కోలు సూచనగా చేతిని గాలిలో వూపుతోంది. ఆమె పెదవులమీద చిరునవ్వు. నేను నిజంగానే ఆశ్చర్యపోయి నా గదిలోకి వెళ్ళిపోయాను.

ఇదీ—శకుంతల !!

ఈ సంఘటన తర్వాత శకుంతల నాకు పెద్ద వేదాంతి లాగానే తోచింది.

సున్నితమైన మనస్తత్వం ఆమె వర్తనలో ప్రతిఫలించదు. విషయం చిన్నదిగానీ, పెద్దదిగానీ, దాన్లో తీవ్రత వుండనీ, వుండకపోనీ ఎక్కువమందిలో కానవచ్చే సెంటిమెంట్స్ ఆమెలో బయటపడవు. ఆమెలో అన్ని వాసనలూ కాలిపోయి, మనస్సు మాడిపోయిందేమోననే విచికిత్స నాలో కలుగసాగింది. ఆమెలోని ఈ ఉదాశీనతనీ, లేదా నిర్లిప్తతనీ తలచుకున్నప్పుడల్లా నాకు మనసంతా అలికేసినట్లయ్యేది.

చంద్రంకి వరంగల్ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వచ్చింది. వెళ్ళాడు. వాడు వెళ్తుంటే ఎన్నో జాగ్రత్తలు చెప్పాను. మనస్సు ఉగ్గబట్టుకుని స్టేషనుకి వెళ్లాను. రైలు సాగిపోతుంటే-ప్లాట్‌ఫారమ్ చివరివరకూ చేయి వూపుతూ వెళ్ళి నిస్సహాయంగా నిలబడి పోయాను.

“ మీది మరీ పసిపిల్లవాడి తత్వం. వాడికేం భయంలేదు పదండి. ప్రాయకం తెలిసి పద్దెనిమిదేళ్ళు వొచ్చిన మేజరు. వాడి గురించి అంత బెంగేం అక్కర్లేదు. ” అని నాకు హితబోధ చేసింది శకుంతల.

నా మనోరాజ్యంలో మటుకు ఆ రాత్రి చాలా యుద్ధాలు జరిగినై. చివరికి "బుద్ధి" చెప్పిన ఏ మాటా వినలేదు మనస్సు. దాని విలాపం దానికి మిగిలింది.

ఇవ్వాళ్ళ కిన్నాళ్ళకి ఇవ్వాళ.

ఉదయం నుంచీ ముభావంగానే వుంది శకుంతల ! !

ఉదయం నిక్కచ్చిగా—చివరిసారిగా తన నిర్ణయం చెప్పేడు మా శంకరం, " నేను డిగ్రీ మూడేళ్ళూ కర్నూలులోనే చదువుకుంటాను. ఈ వూళ్ళో కాలేజీలో చేరను. ఎటొచ్చీ మీకే ఏడు బదిలీకావచ్చు నంటుంటిరి. కనుక నన్ను వూరికే విసిగించి ఏడ్పించవద్దు" అంటూ కళ్ళజోడు సవరించుకుంటూ అప్లికేషన్‌ని పోస్ట్ చేసుకోవడానికి బయటికి వెళ్ళిపోయాడు.

వాడో మొండి ఘటం. ఎక్కువ మాట్లాడడు. ఒకమాట అన్నాడంటే అది జరిగి తీరాల్సిందే.

" సరే...అలాగే కానీయ్ ఇక్కడి కాలేజీ పరిస్థితి విన్న తర్వాత నీ నిర్ణయమూ సరైనదేనని అనిపిస్తోంది " నాలో నేను అనుకుని శకుంతలతోనూ అన్నాను. అలా శంకరం కర్నూలు వెళ్ళడమనే నిర్ణయం ఖాయమైంది.

సన్నని ఉరుములూ మెరుపులూ మొదలయినై.

శకుంతల వచ్చి నా కుర్చీ పక్కగా నేలమీద కూర్చుంది. తలని కుర్చీకొమ్ముకి ఆనించి ఇంటి కప్పుకేసి చూస్తున్నది.

నిముషాలు గడుస్తున్నై.

చూపులు మరల్చి నా కళ్ళల్లోకి చూసింది. నేనూ అప్పుడే తిరిగి చూశాను.

రాజ్యం శత్రువశమయిన మహారాజు చూపు గుర్తొచ్చింది—శకుంతలకేసి చూస్తుంటే. ఆమె ఎందుకో మధన పడుతున్నట్లనిపిస్తోంది. ఏదో చెప్పబోయి సందేహిస్తున్నది.

తారకలు తెగిపడ్తున్న భావన కలుగుతోంది నాకు.

శకుంతల కనుకొలకుల్లో ముత్యాలు.

మేఘం వర్షించనే వర్షించింది.

" వీణ్ణి కూడా దూరంగా పంపిస్తే నేనుండ లేనండీ ! " శకుంతల కంఠం రుద్ధమైంది. చెంగుని నోటికి అడ్డం పెట్టుకుని తల వాల్చుకుంది శకుంతల.

మనోనేత్రం తెరుచుకోవడానికి కూడా తగిన సమయం రావాలంటారు. ఆ సమయం ఇప్పుడు వచ్చింది.

శకుంతలని చూస్తుంటే నా కళ్ళముందు ఎన్నెన్నో వలయాలు ఏర్పడినై. వాటిల్లో ఎన్నెన్నో రంగుల పిట్టలు

C. P. BROWN
MEMORIAL LIBRARY
Acc. No. 3014
CUDDAPAH



గిరికీలు. కొడుతున్నై. పల్లటీలు కొడ్తున్నై. ఆ రంగు లన్నిటా ఇప్పుడు వొకటే వొక ధవళకాంతి దేదీప్యమానంగా వెలుగుతోంది.

శకుంతలకేసి నింపాదిగా చూశాను. సరోవరంలోని చందమామ లాగానే వుంది! ఇన్నాళ్ళూ నేనే అటూ ఇటూ దిక్కులు చూశానని అర్థమైంది.

చల్లని గాలీ—చక్కని తుంపరా—

ప్రాణం చల్లబడింది!

$0_00$